www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

విద్యారంగంలో శాశ్వత మార్పులకు భారీ పెట్టుబడులు



6 లో..

జీవో 76 దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలి



5 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 247, బుధవారం 7-10-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam



ఏడాదిలోపే

ఇందిరమ్మ టవర్స్ పూర్తి

వేగంగా నిర్మించే కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

5,218 మంది అర్హుల నుంచి లక్కీ డ్రా..
480 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 6 :

క్యూర్ పరిధిలో తొలివిడత ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న లక్ష ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి ఏడాదిలోగా అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి ..మిగతా 2లో

కెసిఆర్ భూముల రికార్డుల

పరిశీలనకు నోటీసు

సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమి



కెసిఆర్ ఫామ్ హౌస్ భూముల విచారణపై రేవంత్ సమీక్ష

హైదరాబాద్, అక్టోబర్ 6 :

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల పరిధిలో 45 ఎకరాల భూముల ఆచూకీ లభ్యం కానందున, వాటి గుర్తింపునకు వెంటనే సర్వే నోటిఫికేషన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. 22 ఏ విషయంలో గత నెల 16వ తేదీన శాసనసభలో జరిగిన చర్చలో ముఖ్యమంత్రి ఆ భూములపై విచారణకు ఆదేశించారు. ఆ విచారణ పురోగతిపై ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోదీ పెవిలియన్‌లో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి భూ అక్రమాలపై విచారణకు వేసిన కమిటీ, ధరణి అక్రమాలపై విచారణకు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విచారణ పురోగతి వివరాలను కమిటీ సభ్యులు వివరించారు. ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదై ఉందని, కానీ తాజా సర్వేలో 343 ఎకరాల భూమి మాత్రమే ఉన్నట్లు గుర్తించామని అధికారులు చెప్పారు. రికార్డులో ఉన్న భూమికి, వాస్తవంగా ఉన్న భూమికి మధ్య 45 ఎకరాల వ్యత్యాసం ఉందని తెలిపారు.ఈ నేపథ్యంలో ఆ 45 ఎకరాల భూమిని తేల్చేందుకు ఎర్రవల్లి,



శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వేకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సర్వే నెంబర్ 325 సమీపంలోనే మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకి, ఆయన కుటుంబ ..మిగతా 2లో

జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే

రాహుల్ గాంధీ.. సేవ్ డెమోక్రసీ పేరుతో దిల్లీలో విపక్ష ఎంపీల ర్యాలీ

సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 6:

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాల్సిందేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెట్టిన ఆయన "జ్ఞానేశ్ కుమార్, ఇక చాలు బ్రో. రాజీనామా చేసే సమయం ఆసన్నమైంది" అని అన్నారు. దిల్లీలో సేవ్ డెమోక్రసీ పేరుతో విపక్ష ఎంపీలు ర్యాలీ చేస్తున్న సమయంలోనే రాహుల్ ఈ పోస్టు చేయడం గమనార్హం. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు చేశారు. మోదీ ప్రభుత్వం ప్రజల ..మిగతా 2లో

మమ్మల్ని కలవాలని ఏ పార్టీ కోరలేదు

కలిసేందుకు నిర్దిష్టమైన విధానం ఉంది

రాహుల్ నేతృత్వ నిరసనపై ఈసీ వ్యాఖ్యలు

ఇరు పక్షాలు ఆమోదిస్తేనే సమావేశం సాధ్యం



న్యూఢిల్లీ, అక్టోబర్ 6:

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఎంపీలు ఎన్నికల సంఘాన్ని కలవాలని చేసిన ప్రయత్నంపై ఎన్నికల సంఘం స్పందించింది. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఏ రాజకీయ పార్టీ కూడా అధికారికంగా అపాయింట్‌మెంట్ కోరలేదని, ఆ తర్వాత వచ్చిన సమావేశ ప్రతిపాదనను నిబంధనలకు విరుద్ధంగా భావించి ఆమోదించలేదని తెలిపింది. ఉదయం కొన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం వైపు పాదయాత్ర చేపట్టాయని ఆ సందర్భంగా కొంతమంది ఎంపీలు తమ ప్రతినిధి బృందాలతో కమిషన్‌ను ..మిగతా 2లో

వాయుసేన చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్

వైమానిక దళంలో నాలుగు దశాబ్దాలుగా సేవలు.. అక్టోబర్ 31 బాధ్యతలు స్వీకరణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 6:



భారత వాయుసేనకు తదుపరి అధిపతిగా ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్‌గా సేవలందిస్తున్న ఆయన, వాయుసేన 29వ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. అక్టోబర్ 31 ప్రస్తుత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ పదవీ విరమణ చేయనున్నారు. అదే రోజున నూతన ఎయిర్ చీఫ్‌గా ఆశుతోష్ దీక్షిత్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఎయిర్ మార్షల్ ఆశుతోష్ దీక్షిత్ వాయుసేనలో దాదాపు నాలుగు దశాబ్దాల అనుభవం కలిగిన సీనియర్ ఫైటర్ పైలట్. 1966 డిసెంబర్ 9న జన్మించిన దీక్షిత్ 1986 డిసెంబర్ 6న భారత వాయుసేన ఫైటర్ స్ట్రీమ్‌లో చేరారు. అప్పటి నుంచి వివిధ కీలక హోదాల్లో సేవలందించిన ఆయనకు ఆపరేషనల్, శిక్షణ, విధాన రూపకల్పన, విమాన పరీక్షలు, వ్యూహాత్మక ప్రణాళిక వంటి విభాగాల్లో విస్తృత అనుభవం ఉంది. ఆయన ప్రయాణంలో ఫైటర్ పైలట్‌గా మాత్రమే కాకుండా ప్రయోగాత్మక టెస్ట్ పైలట్, ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా కూడా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. భారత వాయుసేనలోని పలు కీలక యుద్ధ, శిక్షణ విమానాలను నడిపిన అనుభవం కూడా ఉంది. మిరాజ్-2000, వివిధ మిగ్ సిరీస్ విమానాలు, కిరణ్, జాగ్వార్, ఐఎల్-78, హాక్‌తో పాటు స్వదేశీ తేజస్‌లోనూ ఆయన ప్రయాణించారు. ప్రయోగాత్మక టెస్ట్ పైలట్‌గా పనిచేసిన అనుభవం, భవిష్యత్ విమాన సాంకేతికత, యుద్ధ సామర్థ్యాలపై ఆయనకు ప్రత్యేక అవగాహనను కల్పించింది.



సంక్షేమం ఉచితం కాదు..

రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధికి పెట్టుబడి

27 లక్షల మందికి ఏకకాలంలో అల్పాహారంప్రపంచంలో ఎక్కడా లేదు?

తెలంగాణలోనే తొలిసారి.. విద్యార్థుల పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి

బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదు.. మళ్లీ వచ్చేది ఎందుకో చెప్పాలి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 6 :

రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ వేడివేడి అల్పాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో మరెక్కడా లేదని, తెలంగాణలోనే ఈ వినూత్న పథకాన్ని అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం ఉచితం కాదని, అది రాష్ట్ర భవిష్యత్తు మానవ వనరులపై చేస్తున్న పెట్టుబడని నివేదికలో స్పష్టం చేసింది. ఆర్థిక సంవత్సరంలో (ఈజ26) బలమైన పెట్టుబడులు, స్థిరమైన ప్రైవేట్ వినియోగం కారణంగా వృద్ధి రేటు 7.8 శాతానికి చేరుకుందని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. ఇదే ఒరవడి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ కొనసాగుతోందని, వృద్ధికి ప్రైవేట్ వినియోగమే ప్రధాన చోదక శక్తిగా నిలుస్తుందని విశ్లేషించింది. వీటికి తోడు, అంచనాల కంటే మెరుగ్గా రాణిస్తున్న ఎగుమతులు కూడా ..మిగతా 2లో

గ్రేటర్ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, అక్టోబర్ 6 :

గాంధీ జయంతి సందర్భంగా నగరంలో మాంసం దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు తెలంగాణ హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఫిబ్రవరిలో కోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా ప్రవర్తించారంటూ దాఖలైన పిటిషన్‌పై నిన్న విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు.తార్నాకకు చెందిన న్యాయ విద్యార్థి వడ్ల శ్రీకాంత్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. గతంలో ఇలాంటి ఉత్తర్వులపై శ్రీకాంత్ కోర్టును ఆశ్రయించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. స్లాటర్‌హౌస్‌లు, ..మిగతా 2లో



భద్రాద్రి న్యూస్
www.bhadradrinews.com
తెలుగు దినపత్రిక
Follow : @bhadradrinews
బుధవారం
7 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే

మొదటి పేజీ తరువాయి...

హక్కులను హరించివేస్తోందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు సీఈసీ పనిచేస్తున్నారని ఖర్గే ఆరోపించారు. "చూడండి, మోదీ ప్రభుత్వం ప్రజల హక్కులన్నింటినీ హరించివేస్తోంది. అందుకే మేము ఆ అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాం. స్వాతంత్రం తర్వాత మనం పొందిన సార్వత్రిక వయోజన ఓటు హక్కును ఈ ప్రభుత్వం ఈ రోజు అంతం చేయడానికి పనిచేస్తోంది. సీఈసీ కేవలం ప్రభుత్వం చేతిలోని ఓ కీలుబొమ్మ. మోదీ, అమిత్ షా ఏమి చెబితే జ్ఞానేశ్ కుమార్ అది చేస్తున్నారు. ఎన్నికల సంఘం పనితీరు ఇలా ఉండడం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి హానికరం. దీని వల్ల ప్రజాస్వామ్యం నాశనం అవుతుంది. రాజ్యాంగం అంతమవుతుంది. హిట్లర్ తరహా పాలన వస్తుంది. దీనితో మొత్తం ప్రజానీకం బానిసత్వంలోకి నెట్టివేయబడుతుంది. స్వాతంత్రం పొందిన ప్రజలు మరోసారి బానిసత్వంలోకి బలవంతంగా నెట్టబడుతున్నారు" అని ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. అందుకే దీనికి వ్యతిరేకంగా ఇండియా కూటమి నేతలు పోరాడుతున్నారని ఆయన చెప్పారు. తాము కచ్చితంగా తమ లక్ష్యాన్ని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఓటు హక్కు హరిస్తున్నారు!

కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా పౌరుల ఓటు హక్కును హరిస్తోందని ఆరోపించారు. ఫారమ్ 6, 7ల్లో చేసిన మార్పులపై ఆయన పలు ప్రశ్నలు లేవనెత్తారు. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. "ఇది చాలా తీవ్రమైన సమస్య. 18 ఏళ్ల పైబడిన ప్రతి భారతీయ పౌరుడికి తమకు నచ్చే వ్యక్తి ఓటు వేసే హక్కు ప్రాథమిక హక్కు ఉంటుంది. కానీ ఎన్నిక సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ మన పౌరులను వారి ప్రాథమిక హక్కుకు దూరం చేస్తోంది. అందుకే సుప్రీంకోర్టు కూడా ఈ సమస్యను పరిగణనలోకి తీసుకుందని, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఫారమ్ 6, 7ల్లో మార్పులను ఆందోళనకర అంశాలుగా గుర్తించింది" అని కార్తీ చిదంబరం పేర్కొన్నారు.

2017, 2019, 2022, 2024 ఎన్నికల్లో అక్రమాలు జరిగాయ్!

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా సీఈసీపై తీవ్ర ఆరోపణలు చేశారు. 2017, 2019, 2022, 2024 ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ అక్రమాలకు పాల్పడిందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. "గతంలో కూడా జ్ఞానేశ్ కుమార్‌పై ఆరోపణలు వచ్చాయి. 2017. 2019, 2022, 2024ల్లో ఎన్నికల సంఘం అక్రమాలకు పాల్పడింది. ఇక బంగాల్‌లో అయితే వారు పూర్తిగా బహిరంగంగానే అక్రమాలకు పాల్పడ్డారు. ఇది ఎవరికీ కనిపించదు? ఇక యూపీ ఉపఎన్నికల్లో ఓట్ల చోరీ ఎలా జరిగిందో స్పష్టంగా కనిపించింది. చండీగఢ్ ట్రిక్‌ను ఎవరైనా మరిచిపోగలరా?" అని ఆయన అన్నారు. అందువల్ల సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మోదీ, షా, జ్ఞానేశ్ రాజీనామా చేయాల్సిందే!

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి నేతలు, మద్దతుదారులు దిల్లీ వీధుల్లో మంగళవారం ర్యాలీ చేశారు. ఆ తర్వాత కూటమికి చెందిన ఎంపీలు నీతి ఆయోగ్ కార్యాలయం సమీపంలో నిరసన చేపట్టారు. ఈ నిరసన ర్యాలీలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, ఎన్‌సీపీ -ఎస్పీ ఎంపీ సుప్రియా సూలేతోపాటు పలువురు ఇండీ కూటమి నేతలు పాల్గొన్నారు.

మమ్మల్ని కలవాలని ఏ పార్టీ కోరలేదు

మొదటి పేజీ తరువాయి...

కలవాలనుకుంటున్నట్లు మీడియా ద్వారా తెలిసిందని ఎన్నికల సంఘం పేర్కొంది. అయితే సాయంత్రం 4 గంటల వరకు ఏ పార్టీ ప్రతినిధులు అపాయింట్‌మెంట్ కోరలేదని స్పష్టం చేసింది. సాయంత్రం 4 గంటల తర్వాత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఎంపీల బృందం కమిషన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించాలనుకుంటున్నట్లు ఢిల్లీ పోలీసుల నుంచి సమాచారం అందిందని ఎన్నికల సంఘం తెలిపింది. రాజకీయ పార్టీలతో సమావేశాల కోసం 2025లో ఒక విధానాన్ని ఏర్పాటు చేసినట్లు, దానిని అన్ని పార్టీలకు తెలియజేసినట్లు ఎన్నికల సంఘం గుర్తు చేసింది. ఏ పార్టీ ప్రతినిధి బృందమైనా, లేదా పలు పార్టీల ఉమ్మడి బృందమైనా కమిషన్‌ను కలవాలనుకుంటే అధికారిక ప్రతినిధి ద్వారా అపాయింట్‌మెంట్ కోరాలని, ఆ తర్వాత ఇరు పక్షాలు అంగీకరించిన సమయంలోనే సమావేశం జరుగుతుందని వివరించింది. సాయంత్రం 4 గంటల తర్వాత ఢిల్లీ పోలీసుల ప్రతిపాదనలో సమావేశం 240 మంది ఎంపీల బృందంతో జరగనున్నట్లు, ప్రతిపాదిత వేదిక పార్లమెంట్ హౌస్ అనెక్స్ అని ఢిల్లీ పోలీస్ డీసీపీ తెలియజేశారని సంఘం వెల్లడించింది. నియమావళి ప్రకారం ఇలాంటి సమావేశాలు ఎన్నికల సంఘం ప్రాంగణంలోనే జరగాలి కాబట్టి ఆ అభ్యర్థనను ఆమోదించలేదని ఎన్నికల సంఘం తెలిపింది. వినతిపత్రాన్ని స్వీకరించేందుకు కమిషన్‌లోని అత్యంత సీనియర్ అధికారిని సమావేశ వేదికకు పంపేందుకు సిద్ధమైనా ఆ ప్రతిపాదనను కూడా ఎంపీలు తిరస్కరించారని చెప్పింది. దేశ పార్లమెంటరీ, ప్రజాస్వామ్య ప్రక్రియలను, తమ నియమనిబంధనలను, సంప్రదాయాలను గౌరవిస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఏ రాజకీయ పార్టీ అయినా ఎప్పుడైనా సమావేశం కోసం అభ్యర్థించవచ్చని, సౌకర్యాలను బట్టి సమావేశం ఏర్పాటు చేయవచ్చని, ఇది సహజమైన ప్రక్రియ అని పేర్కొంది. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘానికి విపక్ష ఎంపీల సేవ్ డెమోక్రసీ మార్చ్ మంగళవారం ఇండియా కూటమి ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వైపు మార్చ్ చేపట్టారు. ప్రత్యేక సమగ్ర సవరణ ఓటరు జాబితాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు మార్చ్‌ను అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు ఆకాశవాణి భవన్ ప్రాంగణంలో ధర్నాకు దిగారు. ఆ తర్వాత ధర్నా చేసిన నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. సుమారు 300 మంది ఎంపీలు కమిషనర్లను కలవాలనుకుంటే పోలీసులు ఆపారని, తాము కోట్లాది మంది ప్రజల ప్రతినిధులమని, ఎన్నికల కమిషనర్లు ఎందుకు కలవడం లేదని ప్రశ్నించారు. కమిషన్ కార్యాలయం కొద్ది దూరంలోనే ఉన్నా తమను అనుమతించలేదని ఆరోపించారు.



గ్రేటర్ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు

మొదటి పేజీ తరువాయి...

మాంసం దుకాణాల మూసివేతకు సంబంధించిన ఏ ఉత్తర్వులైనా జీహెచ్ఎంసీ చట్టం-1955 నిబంధనలకు అనుగుణంగానే ఉండాలని స్పష్టం చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరించారు.అయితే, ఆ ఉత్తర్వులను పట్టించుకోకుండా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా స్లాటర్‌హౌస్‌లు, రిటైల్ మాంసం, బీఫ్ దుకాణాలను మూసివేయాలని సెప్టెంబర్ 30న జీహెచ్ఎంసీ పత్రికా ప్రకటన విడుదల చేసిందని ఆయన వాదించారు. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం రూపొందించిన నిబంధనలను గెజిట్‌లో ప్రచురించకుండా ఈ నిర్ణయం తీసుకోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. మాంసం దుకాణాల మూసివేత వ్యాపారుల ప్రాథమిక హక్కులను (ఆర్టికల్ 19(1)(ణ)) ఉల్లంఘిస్తుందని తెలిపారు.కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని, ఆయనకు రూ.50,000 జరిమానా విధించాలని పిటిషన్‌లో కోరారు. వాదనలు విన్న న్యాయస్థానం, కమిషనర్‌కు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చేనెల 2వ తేదీకి వాయిదా వేసింది.

ఇస్నాపూర్ పోలీస్ ఇన్స్పెక్టర్‌గా మహేష్

పటాన్ చెరు, అక్టోబర్ 6:

ఇటీవల సంగారెడ్డి జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన నూతన పోలీస్ స్టేషన్లలో భాగంగా ఏర్పడిన ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గా మహేష్ బాధ్యతలు స్వీకరించారు. జిన్నారం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నూతనంగా ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్ నెలకొల్పిన విషయం తెలిసిందే. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మహేష్ పేర్కొన్నారు.





రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కార్యకర్తను పరామర్శించిన నీలం మధు ముదిరాజ్

యాభై వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేత

పటాన్ చెరు, అక్టోబర్ 6:

రోడ్డు ప్రమాదంలో గాయపడి సనత్ నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొల్లారం డివిజన్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను నీలం మధు ముదిరాజ్ మంగళవారం పరామర్శించారు. ఆయనకు సంబంధించిన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని అత్యుత్తమ చికిత్స అందించాలని వైద్యులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తక్షణ సహాయం కింద యాభై వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. బాధితుడి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వీరభద్ర సౌండ్స్ & డెకరేషన్ యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

అధ్యక్షుడిగా దర్గా వీరేశం ఎన్నిక

పటాన్ చెరు, అక్టోబర్ 6 :

ఉమ్మడి జిన్నారం మండల (జిన్నారం, గుమ్మడిదల) పరిధిలోని 'శ్రీ వీరభద్ర సౌండ్స్ ఉ డెకరేషన్స్ యూనియన్' నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ సభ్యుల సమక్షంలో జరిగిన సమావేశంలో నూతన బాధ్యులను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా యూనియన్ నూతన అధ్యక్షుడిగా దర్గా వీరేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నూతన కార్యవర్గ వివరాల ప్రకారం అధ్యక్షులుగా దర్గా వీరేశం, ఉపాధ్యక్షులుగా ఎం. సత్యనారాయణ, టి. ప్రవీణ్ (నల్తూరు), కోశాధికారిగా కె. శ్రీనివాస్ గౌడ్ (గుమ్మడిదల) ప్రధాన కార్యదర్శులుగా ఎ. ప్రసాద్ (రామచంద్రాపురం), ఎం. క్రాంతి (జిన్నారం), సలహాదారులుగా వై. ఆంజనేయులు (గుమ్మడిదల), ఎం. నరసింహులు (గుమ్మడిదల) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దర్గా వీరేశం మాట్లాడుతూ యూనియన్ సంక్షేమానికి, సౌండ్స్ ఉ డెకరేషన్ రంగంలో పనిచేస్తున్న కార్మికులు, యజమానుల హక్కుల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. అందరి సమన్వయంతో సంఘాన్ని ముందుకు నడిపిస్తామని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు యూనియన్ ప్రతినిధులు, సభ్యులు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.





ఏడాదిలోపే ఇందిరమ్మ టవర్స్ పూర్తి

మొదటి పేజీ తరువాయి...

శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా ఏడాది గడువును కాంట్రాక్టర్లకు నిర్దేశించామని అయితే ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ. 90 లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామని చెప్పామని వివరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సహచర మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే కే.పీ, వివేకానంద, పలువురు లబ్దిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనల మేరకు 23 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇందిరమ్మ టవర్స్ ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇళ్ల కోసం 7,000 మందికి పైగా దరఖాస్తులు అందగా, పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని అర్హులైన వారిలో లబ్ధిదారుల ఎంపికను బహిరంగంగా లక్కీ డ్రా ద్వారా చేపట్టి, 480 మంది లబ్ధిదారులను తుది జాబితాలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని, ఎవరికి ఏ విధంగా ఇల్లు మంజూరైందనే వివరాలను కూడా లబ్ధిదారులకు తెలియజేయడంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం కేటాయించిన ఇళ్లతో కార్యక్రమం ముగియదని, మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనితో పాటు నియోజకవర్గంలో ఉన్న ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ కూడా పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతామని తెలిపారు. ఈ మేరకు హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే సూచనలు చేసినట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నారు. లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. "మీ కళ్ల ముందే మీ ఇల్లు నిర్మించబడాలి.. నాణ్యతతో కూడిన ఇంటిని సొంతం చేసుకున్నామనే తృప్తి, ఆనందం మీకు కలగాలి" అనేదే ఇందిరమ్మ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు.పేదల చిన్న చిన్న కోరికలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు.పేదవాడి సొంతింటి కలను కేవలం హామీగా కాకుండా, కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ సెక్రటరీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూ చౌదరి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు లబ్దిదారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కెసిఆర్ భూముల రికార్డుల పరిశీలనకు నోటీసు

మొదటి పేజీ తరువాయి...

సభ్యులకు భూములు ఉన్నందున, వారి భూముల రికార్డులను సమర్పించాలని నోటీసులు జారీ చేస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. సర్వే నంబర్ 325లో గుర్తించే భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే, తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం 'తెలంగాణ అమరవీరుల కాలనీ'ని నిర్మించాలని ఆదేశించారు. అమరవీరుల కుటుంబాల కు ఇళ్ల స్థలాలు కేటాయించి, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో కాలనీని అభివృద్ధి చేయాలని సూచించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగిం చాలని, వచ్చే జూన్ 2వ తేదీలోగా తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొండపాక మండలం వెలికట్ట గ్రామ పరిధిలో అసైన్డ్ భూములు, మిషన్ భగీరథ భూములు మినహా మిగిలిన భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తోపాటు ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో రిజర్వా యర్లు, చెరువుల నీటిని జాగ్రత్తగా వినియోగించాలని అధి కారులకు సూచించారు. మల్లన్న సాగర్ నీటిని అనధికారికంగా వినియోగించే వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

సంక్షేమం ఉచితం కాదు..

రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధికి పెట్టుబడి

మొదటి పేజీ తరువాయి...

ఆర్థిక వృద్ధికి మరింత ఊతమిస్తాయని వివరించింది.రంగాల వారీగా విశ్లేషిస్తే, పారిశ్రామిక రంగం ముందస్తు అంచనాలను మించి రాణిస్తోందని ప్రపంచ బ్యాంకు తెలిపింది. పిల్లలు ఆరోగ్యంగా ఉండి బాగా చదువుకుంటేనే భవిష్యత్తులో రాష్ట్ర ఉత్పత్తికి పెద్ద ఎత్తున తోడ్పడతారని, తద్వారా జీఎస్‌డీపీ వృద్ధికి దోహదం చేస్తారని చెప్పారు.??సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలోని మునగాల గ్రామంలో పాఠశాలల విద్యార్థుల కోసం రూ.9.6 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడారు. 1,020 పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ఒకే కిచెన్ నుంచి పరిశుభ్రమైన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేడివేడి అల్పాహారం అందించేందుకు మునగాలలో ఈ గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు.??రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నామని చెప్పారు. ఇంటి వద్ద వంద మందికి వంట చేయడం కూడా కష్టమైన పరిస్థితుల్లో 27 లక్షల మంది విద్యార్థులకు ఏకకాలంలో అల్పాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో ఎక్కడా లేదని, ఇది తెలంగాణ ప్రభుత్వ మానవీయ దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తని అన్నారు. ఎదిగే వయసులో పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తేనే వారు ఆరోగ్యవంతమైన మానవ వనరుగా ఎదుగుతారని చెప్పారు. అందుకే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు చిన్ననాటి నుంచే నాణ్యమైన ఆహారం అందిస్తూ, వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని వివరించారు.వెల్లడించింది.

ఖమ్మంలో అక్టోబర్ 8న జాబ్ మేళా

– రూ.18 వేల నుంచి రూ.80 వేల వరకు వేతనాలు..
– నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

ఖమ్మం ప్రతినిధి , అక్టోబర్ 6 (భద్రాద్రిన్యూస్): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అక్టోబర్ 8న ఖమ్మంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి తెలిపారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్, లెఅర్నెట్ స్కిల్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ ఉద్యోగ ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉదయం 10 గంటలకు జాబ్ మేళా

ఖమ్మంలోని టిటిడిసి, హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా అక్టోబర్ 8న ఉదయం 10 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్‌లో ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్, డిస్ట్రిబ్యూషన్ ఇన్‌చార్జ్, మెయింటెనెన్స్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ ఇన్‌చార్జ్, స్టోర్ హెల్పర్, క్వాలిటీ ఇన్‌చార్జ్, క్వాలిటీ ఎగ్జిక్యూటివ్, క్వాలిటీ జూనియర్ ఎగ్జిక్యూటివ్, కుక్స్/చెఫ్స్, ఐటీ ఎగ్జిక్యూటివ్, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్ తదితర పోస్టులకు ఉద్యోగ ఎంపికలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ పోస్టులకు విద్యార్హత, అనుభవాన్ని బట్టి నెలకు రూ.18 వేల నుంచి రూ.80 వేల వరకు వేతనాలు అందనున్నాయని తెలిపారు. ములకపల్లిలో వివిధ ఉద్యోగాలకు నియామకాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఇన్ఫోసిస్ GEET ద్వారా శిక్షణ, ప్లేస్‌మెంట్

లెఅర్నెట్ స్కిల్స్ లిమిటెడ్‌లో ఇన్ఫోసిస్ **GEET (Training and Placements)** ద్వారా శిక్షణతో పాటు ప్లేస్‌మెంట్ కోసం కూడా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు మాధవి తెలిపారు. ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన 19--28 సంవత్సరాల వయస్సు గల పురుష, మహిళా అభ్యర్థులు ఈ అవకాశానికి అర్హులని పేర్కొన్నారు. సాధారణంగా జాబ్ మేళాలో పాల్గొనే అభ్యర్థుల వయస్సు 19 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలని, అయితే పోస్టుల వారీగా నిర్దేశించిన విద్యార్హత, వయోపరిమితి, అనుభవాన్ని అనుసరించి ఎంపిక ప్రక్రియ జరుగుతుందని తెలిపారు.

ధ్రువపత్రాలతో హాజరు కావాలి

అర్హత, ఆసక్తి కలిగిన ఖమ్మం జిల్లాతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు జిరాక్స్ కాపీలను తీసుకుని జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి కోరారు. అభ్యర్థుల అర్హత, అనుభవం ఆధారంగా ఆయా సంస్థల ప్రతినిధులు ఎంపిక చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 7075936289, 9912465999 నంబర్లలో హెచ్ఆర్ ప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. ప్రైవేటు రంగంలో లభిస్తున్న ఈ ఉద్యోగ అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మాధవి కోరారు.

బీఆర్ఎస్ ప్రముఖులకు చింతలపూడి జగన్ ఆతిథ్యం

– ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు రవీందర్‌రావు, తాతా మధుసూదన్‌కు విందు



సుజాతనగర్, అక్టోబర్ 6(భద్రాద్రిన్యూస్): సుజాతనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు చింతలపూడి జగన్ తన నివాసంలో పార్టీ ప్రముఖులకు ఆతిథ్యం ఇచ్చారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, తాతా మధుసూదన్‌లను మంగళవారం తన నివాసానికి ఆహ్వానించి, వారి గౌరవార్థం విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్సీలతో కలిసి చింతలపూడి జగన్, కుటుంబ సభ్యులు ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అనుగుల రాకేష్‌రెడ్డి, కాపు సీతామహాలక్ష్మి, శాంతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

బేడి ఆంజనేయస్వామి సన్నిధికి ఎనిమిదవ మహాపాదయాత్ర

- భద్రాచలం నుంచి తిరుమల వరకు సాగిన ఆధ్యాత్మిక యాత్ర.. దర్శన తపనతో ఎదురుచూస్తున్న భక్తులు

ఖమ్మం ప్రతినిధి ,అక్టోబర్ 6 (భద్రాద్రిన్యూస్): భద్రాచలం నుంచి తిరుమల శ్రీవారి సన్నిధి వరకు సాగిన ఎనిమిదవ మహాపాదయాత్ర భక్తి పారవశ్యంతో కొనసాగింది. ఎన్నో రోజులుగా సాగిన ఈ ఆధ్యాత్మిక ప్రయాణంలో అడుగడుగునా శ్రీవారి నామస్మరణ చేస్తూ, అలసటను లెక్కచేయకుండా భక్తులు ముందుకు సాగారు. “గోవిందా.. గోవిందా..” అనే నామస్మరణతో పాదయాత్రికులు తిరుమల కొండను అధిరోహించారు. చివరకు మహాపాదయాత్ర బృందం పవిత్రమైన బేడి ఆంజనేయస్వామివారి సన్నిధికి చేరుకుంది. అక్కడ భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని, కొబ్బరికాయ సమర్పించి, హారతి ఇచ్చారు. భద్రాచలం నుంచి ప్రారంభమైన పాదయాత్ర తిరుమల కొండకు చేరుకోవడంతో భక్తుల్లో ఆనందం వెల్లివిరిసింది.

దివ్య దర్శనం కోసం ఆతృత

పాదయాత్రలో వేసిన ప్రతి అడుగును శ్రీవారికే అంకితం చేస్తూ, పలికిన ప్రతి నామాన్ని స్వామివారికే సమర్పిస్తూ భక్తులు ముందుకు సాగారు. ఎన్నో రోజుల ప్రయాణానికి పరమార్థం, వేలాది అడుగులకు గమ్యం, చేసిన ప్రార్థనలకు ఫలితం అయిన శ్రీవెంకటేశ్వర స్వామివారి దివ్య దర్శనం కోసం భక్తులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. “అడుగులు ముగిశాయి.. నామస్మరణ కొనసాగుతోంది.. పాదయాత్ర గమ్యాన్ని చేరింది.. కానీ భక్తుల హృదయాల ప్రయాణం మాత్రం శ్రీవారి దివ్య దర్శనం వరకు కొనసాగుతూనే ఉంటుంది” అంటూ భక్తులు తమ ఆధ్యాత్మిక అనుభూతిని పంచుకున్నారు.



సుజాతనగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సుజాతనగర్ అక్టోబర్ 6(భద్రాద్రిన్యూస్):సుజాతనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మేయర్ మూడు గణేష్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో పినపాక విద్యార్థినికి సాయం

పినపాక, అక్టోబర్ 06(భద్రాద్రి న్యూస్): ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి విద్యా, క్రీడా అభివృద్ధికి అండగా నిలుస్తున్న తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా సంస్థకు పినపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారి విజయాలను ప్రశంసించడంలో తెలుగు సొసైటీ అమెరికా ఎల్లప్పుడు తోడుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.ఈ నెల 4న ఖమ్మం జిల్లాస్థాయిలో నిర్వహించిన 17 ఏళ్లలోపు బాలికల క్రికెట్ పోటీల్లో పినపాక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కోన. ప్రతికా చౌదరి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచిందని, ఆమె క్రీడా ప్రతిభను మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా సంస్థ రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించిందని తెలిపారు.విద్యార్థుల ప్రతిభను గుర్తించి క్రీడా దుస్తులు, ఆర్థిక సహాయం, అభినందనలు, ప్రోత్సాహం అందిస్తున్న సంస్థ సేవలు అభినందనీయమని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. ఆర్థిక ఇబ్బందులు ప్రతిభకు అడ్డంకిగా మారకుండా సంస్థ అందిస్తున్న సహకారం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి సహకరిస్తున్న తెలుగు సొసైటీ ఆఫ్ అమెరికా సంస్థ నిర్వాహకులు, దాతలు, కలివేటి రమణ దంపతులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరింత మంది ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారి విద్యా, క్రీడా ప్రస్థానానికి సంస్థ అండగా నిలవాలని ఆకాంక్షించారు.



వరుసగా రెండోసారి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా చల్లగుండ్ల నరేష్ కుమార్

-సుజాతనగర్ మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

సుజాతనగర్ అక్టోబర్ 6 (భద్రాద్రిన్యూస్): సుజాతనగర్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా చల్లగుండ్ల నరేష్ కుమార్ వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సుజాతనగర్‌లో నిర్వహించిన ప్రెస్ క్లబ్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ప్రెస్ క్లబ్ అభివృద్ధికి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నరేష్ కుమార్ చేసిన కృషిని గుర్తించిన సభ్యులు ఆయనను మరోసారి అధ్యక్షుడిగా కొనసాగించాల ని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ నందర్భంగా నూతన అధ్యక్షుడు చల్లగుండ్ల నరేష్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం, మండలంలోని ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని అన్నారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా తుంపురు శ్రీనివాస్, కార్యదర్శిగా రహీం పాషా, సభా అధ్యక్షుడిగా ఉబ్బనపల్లి ప్రసాద్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొని నూతన అధ్యక్షుడు నరేష్ కుమార్‌ను అభినందించారు.





కామేపల్లి ఎరువుల షాపులో వ్యవసాయ అధికారులు ఆకస్మిక తనిఖీలు

– ఎరువుల మందుల షాపుల యజమానుల అక్రమాలపై'డిఎఓ' ఉక్కుపాదం!
– జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి పుల్లయ్య పాలు రికార్డుల పరిశీలన

కామేపల్లి,అక్టోబర్ 6 (భద్రాద్రి న్యూస్):- కామేపల్లి మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఎరువులు మందుల దుకాణాలపై జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించినా, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు ఎరువులు విక్రయించినా సహించేది లేదని, నిబంధనలు అతిక్రమిస్తే షాపుల లైసెన్సులు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తీవ్రంగా హెచ్చరించారు. రైతులకు ప్రతి పథకం,సాయం సత్వరమే అందాలంటే సాంకేతిక ప్రక్రియలు వేగవంతం కావాలని స్పష్టం చేశారు. ఫార్మర్ రిజిస్ట్రీ నమోదులో ఏమాత్రం అలసత్వం వహించకుండా ప్రక్రియను పరుగులు పెట్టించాలని వ్యవసాయ విస్తరణ అధికారులకు సూచించారు. అలాగే పొలాల్లో సాగవుతున్న పంటల వివరాలను పక్కాగా నమోదు చేసేందుకు డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వేను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సర్వేయర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు.ఈ ఆకస్మిక తనిఖీల్లో కామేపల్లి వ్యవసాయ అధికారి తారాదేవితో పాటు మండల వ్యవసాయ శాఖ సిబ్బంది,ఇతర అధికారులు పాల్గొన్నారు.



దశదినకర్మకు బియ్యం అందించిన బీఆర్ఎస్ నేతలు

గుండాల అక్టోబర్:6,భద్రాద్రి న్యూస్: కాచనపల్లి గ్రామానికి చెందిన బట్టు పొట్టమ్మ అకాల మరణం చెందడంతో ఆమె దశదినకర్మకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు 25 కేజీల బియ్యాన్ని అందించారు. అనంతరం పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు బి ఆర్ ఎస్ పార్టీ పక్షాన ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అటికం నాగేశ్వరరావు, గుగులోతు కాలు, పోలే బోయిన వెంకట నర్సు, బాలు, రవి, సక్కు, రవి, సక్రం, బాలాజీ , హరి తదితరులు పాల్గొన్నారు



త్రాగునీటి చేతిపంపులకు మరమ్మతులు..

- పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- గ్రామ సర్పంచ్ జామ్ లుసి

?కామేపల్లి,అక్టోబర్ 6(భద్రాద్రి న్యూస్) : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ తెలిపారు. కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో మంగళవారం స్థానిక కొండలు ఇంటి ఎదురుగా ఉన్న చేతిపంపుతో పాటు పలు హ్యాండ్ పంపులకు పంచాయతీ నిధులతో మరమ్మతులు చేయించారు.



?అనంతరం'డ్రై డే – ఫ్రైడే' కార్యక్రమంలో భాగంగా కాలనీ వీధుల్లో,డ్రెయిన్లలో బ్లీచింగ్ పౌడర్ చల్లించి కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పి. అనురాధ,హ్యాండ్ పంప్ మెకానిక్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హమాలీలపై అలసత్వమొద్దు.. హామీలు నెరవేర్చకుంటే పోరాటమే మార్గం

-- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నవీన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరిక





కామేపల్లి,అక్టోబర్ 6 (భద్రాద్రి న్యూస్): కార్పొరేట్ల ఊడిగానికి పెద్దపీట వేస్తూ శ్రమజీవులైన హమాలీ కార్మికులపై అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి ఎన్. నవీన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి తీవ్ర స్థాయిలో ఖండిస్తూ హెచ్చరించారు. మంగళవారం కామేపల్లిలో సీఐటీయూ మండల కన్వీనర్ బదావత్ శ్రీనివాస్ నాయక్ అధ్యక్షతన జరిగిన హమాలీ వర్కర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. హమాలీల సంక్షేమం కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి ప్రతీ కార్మికుడికి అసంఘటిత గుర్తింపు కార్డులతో పాటు సామాజిక భద్రత కల్పించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ పట్టు బట్టారు. ఉచిత వైద్యం కోసం హెల్త్ కార్డులు, ప్రమాద మరణ రక్షణ భీమా పరిహారంగా రూ.25 లక్షల బీమా వర్తింపజేయడంతో పాటు 55 ఏళ్లు దాటిన హమాలీలకు నెలకు రూ.6,000 పెన్షన్ మంజూరు చేయాలని స్పష్టం చేశారు.నిరుపేద కార్మికులకు ప్రభుత్వమే భూమి కొనుగోలు చేసి 120 గజాల స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి'హమాలీ నగర్' ఏర్పాటు చేయాలని,పని ప్రదేశాల్లో తాగునీరు,విశ్రాంతి గదులు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తూనే ఐఎల్ఓ నిబంధనల ప్రకారం 50 కేజీలకు మించిన బస్తాల మోతను తక్షణమే నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కూచిపూడి నరేష్, ముత్తయ్య,రాము, గోపయ్య,మహేష్, రాజు,రఘు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం వన్‌టౌన్, రఘునాథపాలెం ఎస్‌హెచ్‌ఓలుగా నూతన ఇన్స్పెక్టర్లు

– బాధ్యతలు స్వీకరించిన ఎం.డి. సాధిక్ పాషా, టి. కరుణాకర్



ఖమ్మం ప్రతినిధి అక్టోబర్ 6 (భద్రాద్రిన్యూస్) : ఖమ్మం వన్‌టౌన్, రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ల స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా (ఎస్‌హెచ్ఓ) ఇన్స్పెక్టర్లు ఎం.డి. సాధిక్ పాషా, టి. కరుణాకర్ నూతన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇన్స్పెక్టర్లు పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
బుధవారం
7 । అక్టోబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

రాత్రివేళ పామాయిల్ గెలల దొంగతనం

- ముగ్గురు నిందితుల అరెస్ట్.. ట్రాలీ ఆటో, సెల్‌ఫోన్లు, రూ.20 వేల నగదు స్వాధీనం

భద్రాద్రి న్యూస్ । దమ్మపేట । అక్టోబర్ 6 : దమ్మపేట మండల పరిధిలోని పామాయిల్ తోటలను రాత్రివేళల్లో లక్ష్యంగా చేసుకుని పామాయిల్ గెలలను అక్రమంగా నరికి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను దమ్మపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ట్రాలీ ఆటో, మూడు సెల్‌ఫోన్లు, రూ.20 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. దమ్మపేటకు చెందిన పిల్లి వెంకటేశ్వరరావు (45) రాత్రి సమయాల్లో తన ట్రాలీ ఆటోలో పామాయిల్ తోటల్లోకి ప్రవేశించి గెలలను నరికి తరలించేవాడు. అనంతరం దొంగిలించిన గెలలను అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలో విక్రయించేందుకు పెరుమాళ్ల కుమార్ బాబు (27) సహకరించేవాడని తెలిపారు. అదేవిధంగా చిట్టూరి పుల్లారావు (41) తన పేరుతో ఉన్న ఖాతా/కోడ్ ద్వారా దొంగిలించిన పామాయిల్ గెలలను ఫ్యాక్టరీలో విక్రయించేందుకు సహకరించినట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు. గెలల విక్రయం ద్వారా వచ్చిన నగదును ముగ్గురూ పరస్పరం పంచుకునేవారని తెలిపారు. సెప్టెంబర్ 6, 8, 10 తేదీల్లో పర్ణాలగండి గ్రామ శివారు, మొద్దులగూడెం గ్రామ శివారు తదితర ప్రాంతాల్లోని పామాయిల్ తోటల్లో దొంగతనాలకు పాల్పడినట్లు నిందితులు విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. దొంగిలించిన గెలల విక్రయం ద్వారా సుమారు రూ.20 వేల నగదు వచ్చినట్లు పేర్కొన్నారు. నిందితులు నగదు లావాదేవీలతో పాటు ఫోన్‌పే ద్వారా కూడా డబ్బు బదిలీలు నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లలోని డిజిటల్ లావాదేవీలను పరిశీలిస్తూ కేసుపై మరింత



దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు ఛేదనలో అశ్వారావుపేట సీఐ పి. నాగరాజు రెడ్డి, దమ్మపేట ఎస్ఐలు బి. రాజేష్ కుమార్, డి. బాలస్వామినాధం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కేసు ఛేదనలో కీలకంగా పనిచేసిన పోలీస్ సిబ్బంది లక్ష్మణ్, రామకృష్ణ రెడ్డిలను సీఐ నాగరాజు రెడ్డి అభినందించారు.

వెంకటేష్ ఖని కోల్‌మైన్‌లో వోల్వో బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు, సింగరేణి ప్రధాన ఆస్పత్రికి తరలింపు, తప్పిన ప్రాణాపాయం



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 06 (భద్రాద్రి న్యూస్) : సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని వెంకటేష్ ఖని కోల్‌మైన్‌లో మొదటి షిఫ్ట్‌లో డంప్‌యార్డ్ ఆర్ఎల్--710 వద్ద ఓవర్ బర్డెన్ మట్టిని తరలిస్తున్న వోల్వో వాహనం మంగళవారం ప్రమాదానికి గురైంది. డంపింగ్ యార్డ్ వద్ద మూల మలుపులో అతివేగంగా వెళ్లడం వల్లనే అదుపుతప్పి బోల్తా పడ్డట్లు తెలుస్తుంది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గాయపడిన డ్రైవర్‌ను తొలుత రుద్రంపూర్ డిస్పెన్సరీకి తరలించగా, యూనియన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేయడంతో మెరుగైన వైద్యం కోసం సింగరేణి ప్రధాన ఆస్పత్రికి తరలించారు. కాగా డ్రైవర్‌కు అవసరమైన శిక్షణ, లైసెన్స్ ఉన్నాయా? అనే అంశాలపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదానికి గురైన ప్రదేశంలోని మూలమలుపు నిర్మాణం, వెడల్పుపైనా డ్రైవర్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సింగరేణి నిర్దేశించిన భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా మలుపు లేదని, తగినంత వెడల్పు లేకపోవడంతో భారీ వాహనం అదుపుతప్పినట్లు డ్రైవర్ పేర్కొన్నట్లు సమాచారం. ఇదే ప్రాంతంలో గత సెప్టెంబర్ 15న కూడా ప్రమాదం జరిగినట్లు కార్మికులు గుర్తు చేస్తున్నారు. వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ప్రమాదానికి అసలు కారణాలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తేవాలని అలాగే వాహనాల రాకపోకలు జరిగే ప్రాంతాల్లో రహదారి వెడల్పు, మూలమలుపుల నిర్మాణం, బర్మ్ స్థితి, తదితర అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని వారు కోరుతున్నారు.

ప్రజల అవస్థలు పట్టవా....

- ప్రకాష్ నగర్ కాలనీ రోడ్లపై ఎందుకు ఈ..నిర్లక్ష్యం..



భద్రాద్రి న్యూస్ । దమ్మపేట । అక్టోబర్ 6: మండలపల్లి ప్రకాష్ నగర్ కాలనీలో రహదారులు అధ్వానంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలోని పలు రహదారులు గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది.దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రహదారుల సమస్యను పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయినప్పటికీ సమస్య పరిష్కారానికి ఇప్పటివరకు చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ రహదారులకు మరమ్మతులు చేపట్టి సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇకనైనా బాగు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

వైరాలో డివైడర్ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ కాపా చంద్రకళ

- ప్రజల సౌకర్యార్థం మరో డివైడర్ యూటర్న్ ఏర్పాటు



వైరా, అక్టోబర్ 6,(భద్రాద్రి న్యూస్): వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ వైరా-మధిర - జగ్గయ్యపేట నాలుగు వరసల రోడ్డు అభివృద్ధిలో భాగంగా చేపట్టిన అడ్డగోలు డివైడర్ల నిర్మాణంపై మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మంగళవారం పరిశీలించారు. ఈ నిర్మాణం గురించి కాపా చంద్రకళ మాట్లాడుతూ వైరాలోని మెయిన్ కూడలి ప్రధాన వీధులకు వెళ్లే రోడ్లకు డివైడర్ల మధ్యలో యూటర్న్ లేకుండా నిర్మాణం చేస్తున్న విషయమై ఆర్ అండ్ బి డి ఈ రమేష్ దృష్టికి తీసుకువెళ్లారు ఈ విషయంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొత్తగా డివైడర్ నిర్మాణాన్ని కాంట్రాక్టర్ ప్రారంభించాడు 5, 6,9 వార్డుల పరిధిలోని పది రోడ్లకు వెళ్లేచోట్ల యూటర్న్ సౌకర్యం లేకుండా డివైడర్ నిర్మిస్తున్న విషయమై బాధితులు డాక్టర్ చంద్రకళకు ఫిర్యాదు చేశారు. ఆమె వెంటనే హుటాహుటిన ఆర్ అండ్ బి డి తో మాట్లాడి అడ్డగోలు డివైడెడ్ నిర్మాణం పై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ తర్వాత డాక్టర్ చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ ఎం. రామచంద్రరావు , ఆర్ అండ్ బి డి ఈ రమేష్, ఏ ఈ ఈ వసుంధర, ఎస్సై పుష్పాల రామారావు, డివైడర్ నిర్మాణాన్ని పరిశీలించి ఈ మూడు వార్డులలోని పలు రోడ్లకు వెళ్లేందుకు వీలుగా యూటర్న్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయించారు. దగ్గరలో ఎక్స్ప్రెస్ హైవే ఉండటంతో భారీ వాహనాలు, ఇతర వాహనాల రద్దీ దృశ్య ప్రమాదాలు జరగకుండా అందరికీ అందుబాటులో ఉండే విధంగా డివైడర్ యూటర్న్ ఏర్పాటు చేయించారు ఈ విషయంపై స్పందించిన వైరా మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళను పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డి ఈ రమేష్, మున్సిపల్ కమిషనర్ ఎం రామచంద్రరావు, ఏఈఈ వసుంధర, వైరా ఎస్సై పుష్పాల రామారావు తదితరులు పాల్గొన్నారు

పేద కుటుంబానికి బాసటగా నిలిచిన గుడిపూడి తిరుమలరావు

- ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో పెద్దకర్మకు 50 కిలోల బియ్యం అందజేత



కారేపల్లి, అక్టోబర్ 6 (భద్రాద్రి న్యూస్ రాములు): రొట్టమాకిరేవు గ్రామానికి చెందిన ఉడుగు భద్రయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి గుడిపూడి తిరుమలరావు అండగా నిలిచారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో భద్రయ్య కుటుంబాన్ని పరామర్శించి, పెద్దకర్మ కార్యక్రమం కోసం 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గుడిపూడి తిరుమలరావు మాట్లాడుతూ.. పేద కుటుంబాలు ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం, కష్టకాలంలో అవసరమైన సహాయం అందించడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. పేద కుటుంబాలకు కష్టసమయంలో తోడుగా ఉండేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో పేదలకు మరింత చేయూత అందించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. భద్రయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో అడ్డగోడ బలయ్య, రేగులగూడెం సర్పంచ్ ఈసం వీరస్వామి, వోరికొల్లు వీరభద్రం, సామినేని తిరుపతిరావు, అడప్ప వెంకటేశ్వర్లు, ఇరప నరసింహారావు, ఇరప బక్కయ్య, తోలం రవికిరణ్, గొడుగు నాగరాజు, చింత లక్ష్మీనరసు, చీమల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో మెడికల్ అటెండెన్స్ నిబంధనలు మార్చాలి

- అనారోగ్య కార్మికులను ఇబ్బందిపెట్టొద్దు

-- గతంలో మాదిరిగా ఇన్వాలిడేషన్ చేసి కార్మిక కుటుంబాలకు అండగా నిలవాలి

-- ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 06 (భద్రాద్రి న్యూస్) : సింగరేణిలో మెడికల్ అటెండెన్స్ నిబంధనలను వెంటనే మార్చి, అనారోగ్య కారణాలతో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులకు గతంలో మాదిరిగానే ఇన్వాలిడేషన్ చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య యాజమాన్యాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనారోగ్య కారణాలతో పలువురు కార్మికులు మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, తమ వంతు వచ్చినప్పుడు బోర్డుకు హాజరయ్యేందుకు భయపడుతున్నారని తెలిపారు. అనారోగ్య సమస్య ఉన్నప్పటికీ 'ఫిట్ ఫర్ సేమ్ జాబ్' అంటూ పంపిస్తున్నారనే ఆందోళన కార్మికుల్లో ఉందన్నారు. దీంతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. గతంలో అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికులను వివిధ రకాల అనారోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకుని ఇన్వాలిడేషన్ చేసి, వారి డిపెండెంట్లకు ఉద్యోగాలు కల్పించే విధానం ఉండేదని గుర్తు చేశారు. అదే విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డుకు 100 మంది హాజరైతే అందులో కనీసం 10 శాతం మందిని కూడా ఇన్వాలిడేషన్ చెయ్యని పరిస్థితి కార్మికుల్లో ఆందోళనకు కారణమవుతోందన్నారు. తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన కార్మికులను సైతం బోర్డు చుట్టూ తిప్పకుండా, గతంలో ఏరియా ఆసుపత్రుల్లో సీఏంఓ పరిధిలోని వైద్యుల ద్వారా ఇన్వాలిడేషన్ చేసిన విధానాన్ని అమలు చేయాలని కోరారు. 29.01.1981లో మనుబోతుల కొమరయ్య ఆధ్వర్యంలో కార్మిక కుటుంబాలకు వారసత్వ ఉద్యోగాల కల్పనపై కుదిరిన ఒప్పంద స్ఫూర్తిని యాజమాన్యం కొనసాగించాలని మిరియాల రంగయ్య కోరారు. మెడికల్ ఇన్వాలిడేషన్ పేరుతో గతంలో కార్మికులను మధ్యవర్తుల ద్వారా గందరగోళానికి గురిచేసిన పరిస్థితులు పునరావృతం కాకుండా పారదర్శక విధానం అమలు చేయాలని సూచించారు. అనారోగ్యంతో మంచానికే పరిమితమైన కార్మికులను మెడికల్ బోర్డు వరకు వేచి ఉండేలా చేయకుండా, గతంలో మాదిరిగా ప్రధాన ఆసుపత్రి ముఖ్య వైద్య అధికారి పరిధిలో వైద్యులతో కమిటీ ఏర్పాటు చేసి, వైద్య పరీక్షలు నిర్వహించి ఇన్వాలిడేషన్ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో మ్యాన్‌పవర్ సర్‌ప్లస్ ఉందని యాజమాన్యం చెబుతున్నప్పటికీ, ఏ ఏరియాలోనూ వాస్తవంగా సర్‌ప్లస్ మ్యాన్‌పవర్ లేదని మిరియాల రంగయ్య అన్నారు. అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికులను ఇన్వాలిడేషన్ చేసి వారి డిపెండెంట్లకు ఉద్యోగాలు కల్పిస్తే యువతకు ఉపాధి లభించడంతో పాటు కార్మిక



కుటుంబాలకు భరోసా కలుగుతుందని తెలిపారు. కార్మికుల ఆరోగ్యం, కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మెడికల్ అటెండెన్స్ నిబంధనలను తక్షణమే సవరించి, గతంలో అమలు చేసిన విధానాన్ని పునరుద్ధరించాలని రంగయ్య డిమాండ్ చేశారు.

రైతు ప్రజా ప్రయోజనార్థం పొన్నేకల్‌లో

మెగా పశువైద్య శిబిరం

– శాస్త్రీయ పద్ధతులపై రైతులకు అవగాహన





కామేపల్లి,అక్టోబర్ 6 (భద్రాద్రి న్యూస్): గ్రామీణ ప్రాంతాల్లోని పాడి రైతులకు పశు ఆరోగ్యం,మెరుగైన పోషణపై అవగాహన కల్పించే అందుకు లక్ష్యంతో మండల పరిధిలోని పొన్నేకల్ గ్రామంలో అక్టోబర్ 6న ఐసీఏఆర్--ఎన్ఎంఆర్ఐ సంయుక్త ఆధ్వర్యంలో మెగా పశువైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. కామేపల్లి మండల పశు వైద్యాధికారి డాక్టర్ జి.నాగులు ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో ఆవులు, గేదెలు,మేకలు గొర్రెలకు విస్తృత స్థాయిలో వైద్య సేవలు అందించారు. ప్రధానంగా ఆవులు, గేదెలలో ఉన్న గర్భకోశ వ్యాధులు, దీర్ఘకాలిక సంతానోత్పత్తి సమస్యలకు ప్రత్యేక చికిత్సలు చేయడంతో పాటు దూడలు,గొర్రెలకు నట్టల నివారణ మందులు,టీకాలు వేశారు.పశువుల ఆరోగ్య స్థితిని పరిశీలించిన అనంతరం రైతులకు ఉచితంగా మందులు, పోషకాహార సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం ఐసీఏఆర్--ఎన్ఎంఆర్ఐ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పాడి పశువుల పెంపకం, వ్యాధుల నివారణ శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ పురేందర్, తెలంగాణ స్టేట్ వెటర్నరీ డాక్టర్స్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రమేశ్‌బాబు, అధికారి డాక్టర్ కిషోర్,వైరా ఏడీ డాక్టర్ పండారి బాబుతో పాటు పలువురు వైద్యులు, గోపాలమిత్ర సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాడి రైతులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఇందిరా క్రాంతి పదం సి సి .మెంతేన నరేష్ మృతి

నివాళులు అర్పించిన కాచనపల్లి సర్పంచ్ జరుపు ల కిషన్



గుండాల, అక్టోబర్: 6 భద్రాద్రి న్యూస్: గుండాల మండలం కాచన పల్లి గ్రామానికి చెందిన మెం తేన .నరేష్ (40) గత కొంతకాలంగా ఇందిరా క్రాంతి పదం లో వివిధ స్థాయిలలో పని చేస్తూ ప్రస్తుతం టేకులపల్లి మండలంలో సీసీగా విధులు నిర్వహిస్తున్నాడు ప్రస్తుతం పాల్వంచ పట్టణంలో నివసిస్తుండగా సోమవారం రాత్రి గుండెపోటుకు గురి కావడంతో హఠాత్తుగా మరణించాడు మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు మృతుని స్వగ్రామం గుండాల మండలంలోని కాచనపల్లి లో మంగళవారం నాడు అంత్యక్రియలు జరిగాయి నరేష్ భౌతికకాయాన్ని సందర్శించిన కాచనపల్లి సర్పంచ్ జరుపల కిషన్ నివాళులర్పించి కుటుంబానికి సంతాపాన్ని సానుభూతిని తెలిపారు సర్పంచ్ తో పాటు సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు గ్రామ కార్యదర్శి అటికం శేఖర్ ,అరుణోదయ జిల్లా కార్యదర్శి య నగంటి చిరంజీవి .పి వై ఎల్ మండల కార్యదర్శి య నగంటి లాజర్, ఇస్లావత్ శివ శంకర్, మాలోత్ శ్రీను ,అశోక్ అన్న వర్గం నాయకులు రామ చందర్ తదితరులు పాల్గొన్నారు



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు కీలకం

– బీఆర్ఎస్ పార్లమెంటరీ నేత వద్దిరాజు రవిచంద్ర



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 06 (భద్రాద్రి న్యూస్) : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు కీలకమని బీఆర్ఎస్ పార్లమెంటరీ నేత వద్దిరాజు రవిచంద్ర అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ భవన్ లో జరిగిన కొత్తగూడెం నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసపూరితమైన హామీలతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారన్నారు. ఖమ్మం- వరంగల్- నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయ దుందుభి మోగిస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత విద్యావంతుల ఓటు నమోదులో కీలకంగా వ్యవహరించాలన్నారు. నియోజకవర్గంలో ఉన్న 14వేల పై చిలకు ఓట్లను బిఆర్ఎస్ పార్టీకి వేసేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. మోసపూరితమైన హామీలకు తలొగ్గకుండా ప్రజా సమస్యలపై పోరాడే విద్యావంతున్నే ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఏనుగు రాకేష్ రెడ్డి ప్రసంగించగా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ దామోదర్, చుంచుపల్లి మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, కిలారు నాగేశ్వరరావు, మంతపురి రాజు గౌడ్, కొట్టి వెంకటేశ్వర్లు, మల్లెల రవిచంద్ర, అన్వర్ పాష, అనుదీప్, కార్పొరేటర్లు సాగర్ మల్హోత్రా, గుణ చరిత్, రాంబాబు పాల్గొన్నారు.

కేవీకే కొత్తగూడెంలో పొద్దుతిరుగుడు హైబ్రిడ్ విత్తనాల పంపిణీ




కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 06 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ (ఐ సి ఏ ఆర్-ఐ ఐ ఓ ఆర్) హైదరాబాద్ సహకారంతో రైతులకు పొద్దుతిరుగుడు హైబ్రిడ్ ఎస్యుఎన్ఎహెచ్-1 విత్తనాల పంపిణీతో పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం కేవీకే ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డా.టి.భరత్ మాట్లాడుతూ... పొద్దుతిరుగుడు సాగులో సమతుల్య ఎరువుల యాజమాన్యం, సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు (ఐ సి ఎం) పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. శాస్త్రీయ సాగు పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయ సమస్యల పరిష్కారానికి కేవీకే అందిస్తున్న సాంకేతిక సలహాలు, సూచనలు, విస్తరణ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన 60 మంది రైతులకు ఎస్యుఎన్ఎహెచ్ -1 పొద్దుతిరుగుడు హైబ్రిడ్ విత్తనాలను పంపిణీ చేశారు. రైతుల్లో మెరుగైన పొద్దుతిరుగుడు సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించడంతో పాటు జిల్లాలో నూనెగింజల ఉత్పత్తిని ప్రోత్సహించడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి రేడియో కేంద్రం ఆడిట్ అధికారి అభిలాష్, ప్రొడక్షన్ అసిస్టెంట్ శ్రీనివాస్‌తో పాటు 50 మంది రైతులు పాల్గొన్నారు.

శంకర్ వైద్యానికి రూ.2.50 లక్షల సాయం

- రఘురామ రెడ్డి, రాందాస్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ హేమలత బాలాజీ

కారేపల్లి, భద్రాద్రి న్యూస్ రాములు :


VEMULA SRINIVASULU, LLM., MBA., O.S.D. TO CHIEF MINISTER GOVERNMENT OF TELANGANA

CHIEF MINISTER'S OFFICE

Lr. No.13713/CMRF-LOC/2026, Dated:05-10-2024

To The Director, M/s NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82.

Sir, Sub:- CMRF-Sanction of LOC Under CMRF to M/s NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82 towards treatment of individuals-Reg.

Ref:- 1. Letter from the SRI RAMASAHAYAM RAGHURAM REDDY, MP - KHAMMAM, dt.:30-09-2024.

The Hon'ble Chief Minister desires that the treatment of Dharavath Shankar, S/O HARI SINGH, 1-105/1 GATE POLAMPALLI THANDA, SINGARENI, KHAMMAM to be extended as the Hon'ble Chief Minister has assured for sanction of an amount of Rs.**2,50,000/-(Rupees Two Lakh Fifty Thousand Only)** to undergo ALT FREE FLAP COVER.

Necessary action may please be taken for providing Treatment to the individual and send the bill after completion of the treatment.

With best wishes,

Yours sincerely, (Vemula Srinivasulu)

Copy to: SRI RAMASAHAYAM RAGHURAM REDDY, MP - KHAMMAM

Copy to: Dharavath Shankar, S/O HARI SINGH, 1-105/1 GATE POLAMPALLI THANDA, SINGARENI, KHAMMAM

Note:- This letter does not require physical signature and this certificate can be verified by scanning QR code printed on this letter.

పోలంపల్లి తండాకు చెందిన ధారావత్ శంకర్ వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా దిశా కమిటీ సభ్యురాలు, పోలంపల్లి తండా సర్పంచ్ ధారావత్ హేమలత బాలాజీ హర్షం వ్యక్తం చేశారు. శంకర్ వైద్య చికిత్సకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా ప్రత్యేక చొరవ చూపిన ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురామ రెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు సర్పంచ్ హేమలత బాలాజీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, అర్హులకు ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అందించే సహాయం ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు. శంకర్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని సర్పంచ్ హేమలత బాలాజీ ఆకాంక్షించారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన కల్పించిన రాకేష్ రెడ్డి



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 06 (భద్రాద్రి న్యూస్) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేష్ రెడ్డి అవగాహన కల్పించారు. కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం స్టేడియంలో మార్నింగ్ వాకర్స్‌ను కలిసి ఓటరు నమోదుపై వివరించారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ.. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి చెందినప్పటికీ ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలపై పోరాడుతున్నానన్నారు. పట్టభద్రుల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. గత మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పోరాడుతోందని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ ఎన్నికలకు భిన్నమైనవని, విద్యావంతులు, మేధావులు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉన్న ఎన్నికలని పేర్కొన్నారు. డిగ్రీ పూర్తిచేసి మూడేళ్లు పూర్తైన అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు. ఫామ్-18 ద్వారా లేదా తెలంగాణ ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొత్తగూడెం మాజీ మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, సంకు బాపన అనుదీప్, మూడు జయరాం , చింతలపూడి జగన్, రమాకాంత్,రాజేష్ తదితర బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు కుటుంబానికి చెక్కును అందజేసిన భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 06 (భద్రాద్రి న్యూస్) : జిల్లా ఆర్మడ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు కుటుంబానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం తన కార్యాలయంలో చెక్కు రూపంలో రూ.1,00,000/- (లక్ష రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ శాఖలో నిరంతరం విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విధి నిర్వహణలో ఉండి మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తరఫున మృతిచెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అందాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు, ప్రతిఫలాలు త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ ఏవో మంజ్యా నాయక్ పాల్గొన్నారు.

ప్రజా ప్రెస్ క్లబ్ ట్రెజరర్‌గా చాడే శ్రీనివాసరావు



భద్రాద్రి న్యూస్ | దమ్మపేట| అక్టోబర్ 6 : ప్రజా ప్రెస్ క్లబ్ చైర్మన్ షేక్ దస్తగీర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజా ప్రెస్ క్లబ్ ట్రెజరర్‌గా చాడే శ్రీనివాసరావు భారత్ మెడికల్ ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అందరూ అభినందనలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మేకల ఉపేంద్ర, జనరల్ సెక్రటరీ నడ్డి సాయి, ప్రచార కార్యదర్శి ఎండి సాలార్, సభ్యులుగా భేతి ఆనంద్, బొబ్బిలి రాకేష్, షేక్ ఖాసిం, తాళ్ల సాయి, పండూరు కిరణ్, బొబ్బిలి నాగ శివాజీ, సతీష్ పాల్గొన్నారు.

కేజీబీవీలో కలెక్టర్ దివాకర్ .టి.ఎస్ ఆకస్మిక తనిఖీ

– విద్యార్థినులతో ముఖాముఖి.. భోజనం, వసతులపై ఆరా



కారేపల్లి, అక్టోబర్ 6 (భద్రాద్రి న్యూస్ రాములు): కారేపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర.టి.ఎస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా పాఠశాలకు చేరుకున్న కలెక్టర్ విద్యార్థినులకు అందుతున్న విద్య, భోజనం, వసతులు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి భవనాన్ని విద్యార్థినులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్.. పాఠశాలలో అందిస్తున్న భోజనం నాణ్యత, వసతి గదుల్లో సౌకర్యాలు, విద్యాబోధనపై ఆరా తీశారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పాఠశాల ప్రత్యేక అధికారి జి. ఝాన్సీ సౌజన్య పాఠశాలకు అవసరమైన అదనపు మౌలిక వసతులు, ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఆర్టీసీ పరిరక్షణ కోసం ఐక్య కూటమిని గెలిపించండి



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 06 (భద్రాద్రి న్యూస్) : ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎస్‌డబ్ల్యూఎఫ్, టీఎంయూ, టిడబ్ల్యూయూ, ఐఎన్‌టీయూసీ ఐక్య కూటమికి మద్దతు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం కొత్తగూడెం ఆర్టీసీ బస్ డిపో వద్ద సీపీఎం నాయకులు ఐక్య కూటమి అభ్యర్థుల తరపున విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల కోసం ఐక్య కూటమి నిరంతరం పోరాడుతుందని అన్నారు. గతంలో 55 రోజుల సమ్మె సందర్భంగా కార్మికులు చేపట్టిన పోరాటాన్ని ఆయన గుర్తుచేశారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా ప్రైవేటు సంస్థలకు పనులు అప్పగించే విధానాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు మెరుగైన పే స్కేల్ సాధన, పని భారం తగ్గింపు, డిపోల్లోని సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో బాణం గుర్తుకు, రీజియన్‌లో నక్షత్రం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్, లిక్కి బాలరాజు, బత్తుల నాగేశ్వరరావు, ఇస్నాపల్లి శామ్యూల్, అనిల్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 76 దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలి

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 06 (భద్రాద్రి న్యూస్) : పెండింగ్ దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలి రికార్డుల ఆధారంగా పారదర్శకంగా పరిశీలన చేపట్టాలి కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయం ను మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీవో నెంబర్ 76 కింద వచ్చిన దరఖాస్తుల పరిశీలన, స్క్రూటినీ, రికమండేషన్, డిమాండ్ నోటీసుల జారీ, చెల్లింపులపై కొత్తగూడెం ఆర్డీవో మధు, తహసీల్దార్ పుల్లయ్యతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు చేపట్టిన ప్రక్రియ, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జీవో 76 కింద జిల్లాలో మొత్తం 4,031 దరఖాస్తులు ఉండగా, 2,267 దరఖాస్తులకు స్క్రూటినీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన దరఖాస్తులపై విచారణ, సంబంధిత రెవెన్యూ రికార్డుల పరిశీలన పూర్తి చేసి తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి దరఖాస్తు ఏ దశలో ఉందో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ఇప్పటికే రికమండ్ చేసిన దరఖాస్తులను కూడా సంబంధిత రికార్డుల ఆధారంగా మరోసారి పరిశీలించి అర్హతలను ధ్రువీకరించాలని కలెక్టర్ తెలిపారు. గతంలో చేపట్టిన ఫస్ట్ ఫేజ్, సెకండ్ ఫేజ్ ప్రక్రియకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, అధికారులు చేసిన విచారణ, సిఫారసులకు సంబంధించిన ఆధారాలను నిర్ధారించాలని ఆదేశించారు. ఇప్పటివరకు సుమారు 276 దరఖాస్తులకు డిమాండ్ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వివరించారు. డిమాండ్ నోటీసులు జారీ చేసిన దరఖాస్తులు, చెల్లింపులు చేసిన లబ్ధిదారులు, సేల్ ఆర్డర్లు పూర్తయినవి, పట్టాలు జారీ అయిన కేసులను వేర్వేరుగా గుర్తించి పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగూడెం, ఇల్లందు ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తు ఎవరి వద్ద పెండింగ్‌లో ఉంది, విచారణ పూర్తయిందా, రికమండ్ చేశారా, డిమాండ్ నోటీసు జారీ చేశారా, చెల్లింపు జరిగిందా అనే వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. పాత, కొత్త దరఖాస్తులను నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిశీలించాలని ఆదేశించారు. ఇప్పటికే పరిశీలన పూర్తయిన దరఖాస్తులను తదుపరి దశకు పంపడంతో పాటు, మిగిలిన దరఖాస్తులపై విచారణను వేగవంతం చేసి పెండెన్సీని తగ్గించాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించిన రికార్డులను క్రమబద్ధీకరించి, భవిష్యత్తులో ఎటువంటి సందేహాలకు తావులేకుండా చర్యలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. అర్హులైన దరఖాస్తుదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రక్రియను



సకాలంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు.

కారేపల్లిలో పోషకాహార ప్రదర్శన పరిశీలించిన కలెక్టర్ దివాకర్ .టి.ఎస్

– గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



కారేపల్లి, అక్టోబర్ 6 (భద్రాద్రి న్యూస్ రాములు): జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కారేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర.టి.ఎస్ మంగళవారం పరిశీలించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్‌ను సందర్శించి వివిధ రకాల పోషకాహార పదార్థాలు, వాటి తయారీ విధానం, పోషక విలువలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, స్థానిక కూరగాయలు, పండ్లతో తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించిన కలెక్టర్ వాటి ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ఆరా తీశారు. స్థానికంగా లభించే తక్కువ ఖర్చుతో కూడిన పదార్థాలతో పోషకాహారాన్ని తయారు చేసుకునే విధానంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సమతుల్య ఆహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ, పిల్లలు, మహిళల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఆలేటి ప్రమీల, కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కె.ఉమా, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బస్సు, కాగడా గుర్తులకు ఓటెయ్యండి

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు





కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 06 (భద్రాద్రి న్యూస్) : బస్సు, కాగడా గుర్తులకు ఓటెయ్యండి. కార్మిక సంక్షేమానికి భరోసా ఈయూ, ఎన్ఎంయూ.ఎర్రజెండా అండతోనే సమస్యల పరిష్కారం.ఓటుతో కార్మిక ఐక్యతను చాటిచెప్పాలి. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు. టీజీఎస్ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో బస్సు, కాగడా గుర్తులకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం ఆర్టీసీ డిపో ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్మికులను ఉద్దేశించి ఉత్సాహభరితంగా ప్రసంగించారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌కు సుదీర్ఘ పోరాట చరిత్ర ఉందని, ఎన్నో త్యాగాలు చేసి కార్మికులకు అనేక హక్కులు, విజయాలు సాధించిపెట్టిన ఘనత ఎర్రజెండాకే దక్కుతుందని కొనియాడారు. సంస్థను నమ్ముకుని నిరంతరం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులు, ఉద్యోగులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే శరణ్యమన్నారు. రాబోయే 9వ తేదీన జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్లు కలిసి ఉమ్మడిగా బరిలోకి దిగుతున్నాయని తెలిపారు. కార్మిక పక్షాన నిలిచే ఈ కూటమిని తిరుగులేని మెజారిటీతో గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘానికి క్లాజ్-3 కింద పోటీ చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ 'బస్సు' గుర్తుపై ఓటు వేయాలని కోరారు. అలాగే ఖమ్మం రీజియన్ స్థాయిలో క్లాజ్-6 కింద బరిలో ఉన్న నేషనల్ మజ్దూర్ యూనియన్ 'కాగడా' గుర్తుపై ఓటు వేసి విజయదుందుభి మోగించాలని పిలుపునిచ్చారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరంతరం పోరాడే శక్తులకు అండగా నిలవాలని ఆయన కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్, నాయకులు కంచర్ల జమలయ్య, నేరెళ్ల రమేష్, ఈయూ, ఎన్ఎంయూ రాష్ట్ర, జిల్లా నాయకులూ ఎస్ బాబు, మౌలానా, థామస్ రెడ్డి, పిల్లి రమేష్, టివి ప్రసాద్, ఎస్ డి నజీర్, ఆర్ యెన్ సింగ్, హరివర్మ, జిని శేఖర్, ఖాజామొహినుద్దీన్, జి రాజు, రేణుకాదేవి, రాధాదేవి, సంధ్య తదితరులు పాల్గొన్నారు

కారేపల్లిలో పోషకాహార ప్రదర్శన పరిశీలించిన కలెక్టర్ దివాకర్ .టి.ఎస్

– గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కారేపల్లి, అక్టోబర్ 6 (భద్రాద్రి న్యూస్ రాములు): జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కారేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర.టి.ఎస్ మంగళవారం పరిశీలించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్‌ను సందర్శించి వివిధ రకాల పోషకాహార పదార్థాలు, వాటి తయారీ విధానం, పోషక విలువలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, స్థానిక కూరగాయలు, పండ్లతో తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించిన కలెక్టర్ వాటి ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ఆరా తీశారు. స్థానికంగా లభించే తక్కువ ఖర్చుతో కూడిన పదార్థాలతో పోషకాహారాన్ని తయారు చేసుకునే విధానంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సమతుల్య ఆహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ, పిల్లలు, మహిళల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఆలేటి ప్రమీల, కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కె.ఉమా, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు ఘన సన్మానం

- వేగం పుంజుకోనున్న వీకే సీఎం ప్రాజెక్టు పనులు

- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం



కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 06 (భద్రాద్రి న్యూస్) : సింగరేణి కొత్తగూడెం ఏరియాలో కీలకమైన వీకే సీఎం ఉపరితల గనికి నూతన ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.శంకర్‌కు కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన పీఓ జి.శంకర్‌కు శాలువాలు కప్పి,ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ.. వీకే సీఎం ఓసీపీ కొత్తగూడెం ఏరియాలో అత్యంత లాభదాయకమైన ప్రాజెక్టుల్లో ఒకటని, గత కొన్ని నెలలుగా అనేక సాంకేతిక, కార్మిక సమస్యలతో ప్రాజెక్టు పనులు కొంత మందగించాయని అన్నారు. నూతన పీఓగా అనుభవం కలిగిన జి.శంకర్ రాకతో ప్రాజెక్టు పనులు మరింత వేగంగా, సమర్థవంతంగా ముందుకు సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.”జి.శంకర్ ఎంతో అంకితభావంతో, కార్మికులతో సమన్వయంతో పనిచేసే అధికారిగా పేరు పొందారని.ఆయనకు అప్పగించిన ఈ బాధ్యతను పూర్తి నిష్ఠతో నిర్వహించి, కార్మికుల సంక్షేమం, గని భద్రత, ఉత్పత్తి లక్ష్యాలను సమపాళ్లలో సాధిస్తారని నమ్ముతున్నాం” అని నాయకులు అన్నారు.కార్మికులకు ఉన్న ప్రధాన సమస్యలైన మ్యాన్ పవర్ కొరత, యంత్రాల నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, సంక్షేమ సౌకర్యాలపై నూతన పీఓ దృష్టి సారించాలని బ్రాంచ్ కార్యదర్శి జక్కుల గట్టయ్య కోరారు.యాజమాన్యానికి, కార్మికులకు మధ్య వారధిగా ఏఐటీయూసీ ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి జక్కుల గట్టయ్య, ఆఫీస్ బేరర్ హీరాలాల్, వీకే సీఎం అసిస్టెంట్ పిట్ కార్యదర్శి కోటి, ఏరియా స్టోర్స్ పిట్ కార్యదర్శి శ్రీనివాస్ (కమల్), కోటి, సీనియర్ నాయకులు రాజాలపూడి సాంబమూర్తి, ఓదెలు, శ్రీనివాస్, పాల్తేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం అనంతరం నూతన పీఓ జి.శంకర్ మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, కార్మికుల సహకారంతో వీకే సీఎం ప్రాజెక్టును అన్ని విధాలా ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- రక్తదానంతో ప్రాణాలు కాపాడుదాం

- సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రక్తదానం

- బిజెపి సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి



కోదాడ, అక్టోబర్ 6(భద్రాద్రి న్యూస్): ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానం అని సూర్యాపేట జిల్లా బిజెపి అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ‘సేవా సంకల్ప్ అభియాన్’లో భాగంగా మంగళవారం బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ టి.ఎన్. విద్యాసాగర్ ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలోని పెరిక హాస్టల్‌లో తలసేమియా బాధితుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చల్లా శ్రీలత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తులకు నిరంతరం రక్తం అవసరమవుతుందని, యువత పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో సుమారు 60 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ టి.ఎన్. విద్యాసాగర్ మాట్లాడుతూ తలసేమియా బాధితులకు అండగా నిలవడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. శ్రీ మల్లెబోయిన వెంకటేష్ బాబు, కొదుమూరి ప్రవీణ్ కుమార్ ల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కనగాల వెంకటరామయ్య, బొలిశెట్టి కృష్ణయ్య, పంగవీటి శ్రీనివాసరావు, కళ్యాణ్, చెన్నకేశవరావు, రవి,కటుకోజు నాగేంద్రచారి, ప్రవీణ్, గోధేశ్ లక్ష్మణ్, పోలిశెట్టి పురుషోత్తం, సత్యరాజు, పురుషోత్తం రెడ్డి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన రంజిత్ కుమార్

- ఇందిరమ్మ ఇళ్ల విచారణ త్వరగా పూర్తి చేయాలి.. పహాణీల సమస్య పరిష్కరించాలి



కారేపల్లి, అక్టోబర్ 6 (భద్రాద్రి న్యూస్ రాములు): సింగరేణి మండల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు, గాదెపాడు సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం సింగరేణి మండల ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించారు. మండలంలో ఐటీడీఏ ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గత తొమ్మిది నెలలుగా విచారణ ప్రక్రియ పూర్తికాకపోవడంతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని రంజిత్ కుమార్ తెలిపారు. సంబంధిత విచారణను త్వరగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్‌ను కోరారు. అదేవిధంగా రైతులు తమ పేర్లపై ఉన్న భూములను కుటుంబ సభ్యుల పేర్లకు బదలాయించుకునేందుకు రెవెన్యూ శాఖకు సమర్పిస్తున్న కే-ఫారం దరఖాస్తులకు పాత పహాణీలు అందుబాటులో లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పహాణీలు అందుబాటులో లేవనే కారణంతో దరఖాస్తులను తిరిగి పంపుతున్న పరిస్థితి ఉందని వివరించారు. దీనిపై కలెక్టర్ తహసీల్దార్‌ను వివరణ కోరగా, 1970 నుంచి 1980 కాలానికి సంబంధించిన పహాణీ పుస్తకాలు భౌతికంగా మండల కార్యాలయంలో అందుబాటులో లేవని తెలిపారు. దీంతో పాత పహాణీలు అందుబాటులో లేవన్న విషయాన్ని తహసీల్దార్ లిఖితపూర్వకంగా ధ్రువీకరించి, ఆ లేఖను సంబంధిత కే-ఫారం దరఖాస్తుకు జత చేయాలని కలెక్టర్ సూచించారు. రైతుల దరఖాస్తులు పాత పహాణీలు అందుబాటులో లేని కారణంగా పెండింగ్‌లో పడకుండా నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించినట్లు భూక్య రంజిత్ కుమార్ తెలిపారు. మండలంలోని ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

చర్ల ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ.. సేవలపై ఆరా!

- అడిషనల్ డీఎంహెచ్ఓ సైదులు క్షేత్రస్థాయిలో పరిశీలన..

- రోగులతో నేరుగా మాట్లాడి సమస్యలపై ఆరా..

- మందుల – లభ్యత, వైద్యుల హాజరు, మౌలిక సదుపాయాలపై పరిశీలన







చర్ల, అక్టోబర్ 6 (భద్రాద్రి న్యూస్):
ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎంహెచ్ఓ సైదులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా ఆస్పత్రికి చేరుకున్న ఆయన వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్యులు, సిబ్బంది హాజరు, మౌలిక సదుపాయాల పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. **రోగులతో నేరుగా మాట్లాడి..** తనిఖీలో భాగంగా ఆస్పత్రికి వచ్చిన రోగులతో అడిషనల్ డీఎంహెచ్ఓ నేరుగా మాట్లాడారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయి? అవసరమైన మందులు అందుతున్నాయా? వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా? ఆస్పత్రిలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? అనే అంశాలపై ఆరా తీశారు. రోగుల నుంచి నేరుగా సమాచారం సేకరించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని తెలుసుకున్నారు.
మందుల లభ్యతపై ఆరా : ఆస్పత్రిలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా? మందుల నిల్వలు ఎలా ఉన్నాయి? రోగులకు మందులు సకాలంలో అందుతున్నాయా? అనే అంశాలను పరిశీలించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు.
వైద్యుల హాజరు.. సేవలపై పరిశీలన : ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, ఇతర సిబ్బంది హాజరును కూడా పరిశీలించారు. రోగులకు వైద్య సేవలు సకాలంలో అందుతున్నాయా? అనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగి సమస్యను ఓపికగా విని, అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.
సేవల్లో లోటు లేకుండా చూడాలి : ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ సైదులు సూచించారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా, రోగులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన మందులు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది అందుబాటు వంటి అంశాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగిని గౌరవంగా చూసి, వారి సమస్యలకు సకాలంలో స్పందించాలని తెలిపారు. అడిషనల్ డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీతో చర్ల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న సౌకర్యాలపై మరోసారి దృష్టి పడింది.

విద్యారంగంలో శాశ్వత మార్పులకు భారీ పెట్టుబడులు

- పిల్లల పౌష్టికాహారం, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం

- 60 వేల మంది విద్యార్థుల కోసం మునగాలలో మెగా కిచెన్

- ఉత్తమ్, పద్మావతి విజ్ఞప్తితో సింగరేణి నుంచి రూ.9.60 కోట్ల సహకారం

- వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే గడ్డిపల్లి పాఠశాల పూర్తికి ఆదేశం







కోదాడ, అక్టోబర్06(భద్రాద్రి న్యూస్):
విద్యారం గంలో శాశ్వత మార్పులు తీసు కురావడమే లక్ష్యం గా తెలంగాణ ప్రభుత్వం భారీ పెట్టుబడులు పె డుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారు దల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాల పిల్లలకు పౌష్టి కాహారం, నాణ్యమైన విద్య, ఆ ధునిక వసతులు అందిం చేందు కు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నా మని చెప్పారు. విద్యా ర్థుల ఆరో గ్యం, చదువు, భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ప్ర భుత్వ కార్యక్ర మాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యాధునిక సెంట్రలైజ్డ్ కమ్యూ నిటీ కిచెన్‌కు మంగళవారం భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం గడ్డిపల్లిలో రూ.200 కోట్లతో ని ర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ప నులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు.రోజూ 60 వేల మందికి పౌష్టిక అల్పాహారం మునగాల కమ్యూనిటీ కిచెన్ ద్వారా సూర్యాపేట జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల ల్లో చదువు తున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ప్రతి రోజూ పౌష్టిక అల్పాహారం అందించనున్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిట బుల్ ఫౌండేషన్ సహకారంతో ఏ ర్పాటు చేస్తున్న ఈ వంటశాలలో ఆహార తయారీ, ప్యాకింగ్, రవా ణా, విద్యాసంస్థలకు పంపిణీ వ రకు సమగ్ర వ్యవస్థను రూపొంది స్తున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఈ ప్రాజెక్టుకు రూ.9.60 కోట్ల ఆర్థిక సహకా రం అందిస్తోంది. శంకు స్థాపన కార్యక్రమంలో భట్టి విక్ర మార్క మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించడం వారి ఆరో గ్యం, చదువు, భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టడమేనని అన్నా రు. సంక్షేమ కార్యక్రమాలను కేవ లం ఉచితాలుగా చూడొద్దని సూ చించారు. కుటుంబాలను బలో పేతం చేసి, ప్రజలు రాష్ట్రాభి వృద్ధి లో మరింత సమర్థంగా భాగస్వా ములయ్యేందుకు ఇవి తోడ్పడ తాయని వివరించారు.

విద్యతోపాటు పౌష్టికాహారం అవసరం

పిల్లల ఎదుగుదలకు తరగతి గదిలో అందించే విద్యతోపాటు పౌష్టికాహారం కూడా అవసరమ ని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చే శారు. చిన్న వయసు నుంచే సరి పడా ఆరోగ్యకరమైన ఆ హారం అందితే వారి అభ్యసనానికి తో డ్పడుతుందని చెప్పా రు. మునగాల కిచెన్ ద్వారా ప్రారంభంలో దాదాపు 60 వేల మందికి అల్పా హారం అందిస్తామని, భవిష్యత్తులో లబ్ధిదా రుల సంఖ్య పెరిగే అ వకాశం ఉందని తెలిపారు. కా ర్యక్ర మంలో భాగంగా విద్యార్థుల కు అల్పాహారంతోపాటు పాలు, రాగిజావ అందిస్తామని చెప్పా రు.ఆహార నాణ్యత, పౌష్టిక విలు వలు, పరిశుభ్రత, సురక్షిత నిర్వ హణకు ప్రత్యేక ప్రాధా న్యం ఇస్తా మని ఉత్తమ్ తెలిపారు. అవస రాలను బట్టి ఎంపి క చేసిన జూని యర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం అం దించేలా కూడా కా ర్యక్రమాన్ని విస్తరించే అవకాశం ఉందని అధికారులు వివరించారు. విద్యార్థుల సంక్షేమం, హాజరు, అభ్యసన ఫలితాలు, విద్యావకా శాలను మెరుగుపరిచే ప్రభుత్వ ప్రయత్నాలకు ఈ కార్యక్రమం తోడ్పడుతుందని ఉత్తమ్ అన్నారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా అధికారులు, అమలు భాగ స్వాములతో సమన్వయం చే సుకుంటూ కిచెన్ నిర్మాణం, ని ర్వహణను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని చెప్పారు.

పాఠశాల పనులకు వారాలవారీ ప్రణాళిక

గడ్డిపల్లి యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని వచ్చే విద్యా సంవ త్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని భట్టి విక్రమార్క ఆదే శించారు. అనుకున్న ప్రకారం ప్ర వేశాలు ప్రారంభించేందుకు వీలు గా అధికారులు, నిర్మాణ సంస్థ వారాల వారీగా సమగ్ర పనుల ప్రణాళిక సిద్ధం చేయాలని సూ చించారు. నిర్మాణంలో జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చే శారు. నిర్ణయించిన కాలపట్టికకు అనుగు ణం గా పనుల పురోగతిని జిల్లా యంత్రాంగం నిశితంగా ప ర్యవేక్షించాలని ఆదేశించారు. ఆధునిక తరగతి గదులు, వసతి గృహాలు, క్రీడా సదుపాయా లు, ఇతర విద్యార్థి వసతులన్నీ ఒకే ప్రాంగణంలోఉండేలా గడ్డిపల్లి పాఠశాలను ఆదర్శ విద్యాలయంగా తీర్చిదిద్దుతున్నామని భట్టి తెలిపారు.గ్రామీణ తెలంగాణ భవి ష్యత్తుపై పెట్టుబడిగా ఈ పాఠశాలను అభివర్ణించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ప్రముఖ పాఠశాలలతో సమానమైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. గ్రామీణ,గురుకుల విద్యాసంస్థ ల్లో దీర్ఘకాలంగా కొనసాగు తున్న మౌలిక వసతుల కొరతను ఇంటి గ్రేటెడ్ పాఠశాలల ద్వారా పరిష్క రిస్తున్నామని ఉత్తమ్ తెలిపారు. అనేక విద్యా సంస్థలు అద్దె భవ నాల్లో లేదా సరిపడని భవనాల్లో నడుస్తూ తరగతి గదులు, వస తి, పారిశుద్ధ్య సదుపాయాల కొ రతను ఎదుర్కొన్నాయని చెప్పా రు. గ్రామీణ పిల్లలకు కూడా ఇత ర ప్రాంతాల్లో లభించే నాణ్యమైన విద్య, సదుపాయాలు అందిం చడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా 105 ఇం టిగ్రేటెడ్ పాఠశాలలుయంగ్ ఇం డియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తం గా 105 పాఠశాల లను ఏర్పాటు చేస్తున్నామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రూ.200 కోట్లతో చేపట్టిన గడ్డి పల్లి పాఠశాల ఈ కార్యక్రమంలో భాగమని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీతోపాటు ఇతర వర్గాల విద్యార్థులు కలసి చదువుకునేలా నాణ్యమైన విద్య, వసతి, క్రీడా సదుపాయా లు, సమగ్ర విద్యార్థి సహాయ వ్యవస్థను అందుబాటు లోకి తీసుకొస్తున్నామని వివరిం చారు. గడ్డిపల్లి ప్రాజెక్టును మంజూరు చేయడంతోపాటు మారుమూ ల ప్రాంతానికి స్వయంగా వచ్చి పనులను సమీక్షించిన భట్టి విక్ర మార్కకు ఉత్తమ్ కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాణ సంస్థకు సకా లంలో చెల్లింపులు జరిగేలా చూ స్తున్న ఆర్థిక శాఖకు ధన్యవాదాలు చెప్పారు. భూమి, అనుమ తులు, పాఠశాలకు చేరుకునే ర హదారి ఏర్పాట్లలో సహకరించిన సూర్యాపేట జిల్లా యంత్రాంగా న్ని అభినందించారు. పాఠశాల, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలను నిర్ణీత గడువుల్లో పూర్తి చేసేం దు కు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యం త్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. హుజూర్‌నగర్ ను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం గడ్డిపల్లి పాఠశా లతో హుజూర్‌నగర్ నియోజకవర్గం, పరిసర గ్రా మీణ ప్రాం తాల పిల్లలకు ఇంటికి చేరువలోనే నాణ్యమైన విద్య అందుబా టులోకి వస్తుందని ఉ త్తమ్ తెలిపారు. హుజూర్‌నగర్ ను తె లంగాణ లోని అగ్రగామి ని యోజకవర్గాల్లో ఒకటిగా తీర్చి ది ద్దేందుకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. ముఖ్యమంత్రి ఎ. రే వంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి అభివృద్ధి పనుల ను వేగవంతం చేస్తానని తెలిపారు. మునగాల కమ్యూనిటీ కిచెన్, గడ్డిపల్లి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియ ల్ పాఠశాల ద్వారా గ్రామీణ సూ ర్యాపేటలోని పిల్లల జీవన ప్రమా ణాలు, పౌష్టికాహారం, విద్యావ కాశాలను మెరుగుపర చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మం త్రులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఎన్. పద్మావ తిరెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ప్రజాప్ర తినిధులు, ఉన్న తాధికారులు పాల్గొన్నారు.